# ఏర్పాట్లు పూర్తి

- మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్‌లో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలకు ఏర్పాట్లు
- 16న జహీరాబాద్ ట్రాక్టరు ప్లాంట్‌లో ఎన్నికలు
- భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ పోటీ
- రెండోసారి గెలుపు కోసం రాంబాబు యాదవ్ జోరుగా ప్రచారం



జహీరాబాద్‌లో ఉన్న మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్

జహీరాబాద్, డిసెంబర్ 14 : మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్‌లో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రాక్టరు ప్లాంట్‌లో ఈ నెల 16న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల కోసం ఏర్పాట్లు చేయగా, గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టీయూ), మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ యాక్టివ్ వర్కర్స్ యూనియన్ పోటీ చేస్తున్నది. సీఐటీయూ, బీఎంఎస్ కార్మిక సంఘం పోటీ చేస్తున్నది. జహీరాబాద్ ట్రాక్టర్ ప్లాంట్‌లో మొదటి సారి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు 2021 సెప్టెంబర్ 21న నిర్వహించారు. అప్పుడు టీఆర్ఎస్‌కే కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందింది. టీఆర్ఎస్‌కే అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్ పోటీ చేసి సీఐటీయూపై గెలుపొందారు. రెండో సారి జరుగుతున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జోరుగా ప్రచారం చేస్తున్నది. శుక్రవారం గేట్ మీటింగ్ ఏర్పాటుకు కార్మికులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. రెండోసారి రాంబాబు యాదవ్ విజయం కోసం కార్మికులు జోరుగా ప్లాంట్‌లో ప్రచారం చేస్తున్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్‌లో 410 మంది కార్మికులకు ఓటు హక్కు ఉంది. వీరు ఈ నెల 16న జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్‌కేకు 239 ఓట్లు రాగా, సీఐటీయూకు 157 ఓట్లు, బీఎంఎస్‌కు 13 ఓట్లు వచ్చాయి. కార్మిక సంఘం ఎన్నికలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహిస్తారు.



జహీరాబాద్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్ వద్ద గులాబీ జెండాలు

# బస్సు ప్రయాణం.. మహా సంకటం

- బస్సు నిండా మహిళా ప్రయాణికులే..
- బస్సులో కనిపించని పురుష ప్రయాణికులు
- కండక్టర్ టికెట్ ఇద్దామన్నా నిలబడలేకుండా జనాలు



ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కేందుకు వేచిచూస్తున్న మహిళలు

రామాయంపేట, డిసెంబర్ 14 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహా సంకటంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమా అని ఏ బస్సు చూసినా మహిళా ప్రయాణికులే బస్టాండులన్నీ మహిళలతో నిండిపోతున్నాయి. బస్సుల్లో పురుష ప్రయాణికులు కనిపించడం లేదు. ఒకవేళ ఒకరిద్దరు ఉన్నా వారికి టికెట్ ఇవ్వడానికి కండక్టర్ ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గురువారం రామాయంపేట బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ మహిళలతో కిక్కిరిసి కనిపించాయి.

అప్పటికే బస్సులో 150 మంది వరకు మహిళా ప్రయాణికులు ఉండగా, రామాయంపేటలో మరో 50 మంది మహిళలు ఎక్కా రు. దీంతో కండక్టర్‌కు పురుషుల టికెట్ ఇచ్చేందుకు నానాతంటాలు పడ్డారు. ఉచిత బస్సు ప్రయాణంతో కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో బస్సులో రెండు వందలకు పైగా ప్రయాణికులు ఎక్కడంతో డ్రైవర్, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న రామాయంపేట బస్టాండ్





గురువారం శాసనసభలో ప్రమాణస్వీకారం చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# దైవసాక్షిగా..

- అసెంబ్లీలో ప్రమాణం చేసిన దుబ్బాక, జనగామ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

దుబ్బాక/చేర్యాల, డిసెంబర్ 14 : రాష్ట్రంలో మూడో శాసనసభ కొలువుదీరింది. అసెంబ్లీలో గురువారం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించారు. దుబ్బాక, జనగామ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభలో తొలిసారిగా దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, రెండుసార్లు మెదక్ ఎంపీగా కొనసాగారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచనల మేరకు దుబ్బాక శాసనసభ నుంచి పోటీ చేసి, భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఎంపీగా ఉంటూ ఎమ్మెల్యేగా ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ముందుగా పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా సమర్పించిన తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయాల్సి వచ్చింది. ఇందుకు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణం స్వీకారం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒకేరోజు ప్రమాణస్వీకారం చేయడం దుబ్బాక నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక ముద్దుబిడ్డగా రెండు పర్యాయాలు మెదక్ ఎంపీగా విస్తృత సేవలందించిన కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్యేగా దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువ కానున్నారు. శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను కుల మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ న్యాయం చేకూరుస్తానని మనస్ఫూర్తిగా వాగ్దానం చేశారు. జనగామ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# పిల్లల వివరాలు దత్తత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి

డీడబ్ల్యూవో సంధ్యారాణి





మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సంధ్యారాణి, హాజరైన ఆయా శాఖల అధికారులు

సంగారెడ్డి, డిసెంబర్ 14 : దత్తతకు అర్హత కలిగిన పిల్లల వివరాలు దత్తత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని డీడబ్ల్యూవో సంధ్యారాణి అధికారులకు సూచించారు. గురువారం సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ, డబ్ల్యూఐసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 12 బాలల శిశు సంరక్షణ కేంద్రాలకు దత్తతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిశు సంరక్షణ కేంద్రాలు, పిల్లల సంబంధిత వివరాలు అన్ని అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అందరూ జువైనల్ జస్టిస్ యాక్ట్ 2021 ప్రకారం శిశు సంరక్షణ కేంద్రాలు నడపాలన్నారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం ప్రకారం కెర వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో ఉండాలన్నారు. సంగారెడ్డి జిల్లాలో డీసీపీయూ యూనిట్ చాలా బాగా పని చేస్తున్న దని, కొన్ని రోజుల క్రితం నలుగురు తప్పిపోయిన బాలికలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు విష్ణుమూర్తి, మెదక్ సీడబ్ల్యూసీ సభ్యులు ఉప్పలయ్య, డీసీపీవోలు రత్నం, కర్ణశీల, రామకృష్ణ, లింగం, నాగరాజు, శిశు రక్షణ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజకీయ నాయకులు సహకరించాలి

- ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, సవరణలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- హుస్నాబాద్ ఆర్డీవో బెన్ షాలోమ్

హుస్నాబాద్, డిసెంబర్ 14 : కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిం చినట్లు ఆర్డీవో బెన్‌షాలోమ్ తెలిపారు. ఇందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించి, యువతను చైతన్యం చేయాలని కోరారు. గురువారం సాయంత్రం హుస్నాబాద్‌లోని ఐవోసీ భవనం సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ, కొత్త ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 2వ తేదీ నుంచి కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందని, ఫిబ్రవరి 6వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఫిబ్రవరి 8న ఓటరు జాబితా పబ్లికేషన్ ఉంటున్నందున అర్హులైన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ నాయకుడు కేడం లింగమూర్తి, సీపీఐ నాయకుడు గడిపె మల్లేశ్, బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ బూత్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారని, పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. రాబోయే రోజుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, రాజకీయ నాయకులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి వివిధ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బెన్ షాలోమ్